# నేను సగటు మనిషిని

మాచవరం ప్రవీణ్ కుమార్

అద్దంలో చూసుకున్న ప్రతీసారి
నన్ను నే కోల్పోతుంటాను
యుద్ధంలో దూసుకున్న ప్రతీ కత్తికి
అంటుకున్న రక్తపు మరకల్లో
నాలో ఉన్న మౌఢ్యాన్ని చూసుకుంటుంటాను

ఒక మేఘం కమ్మితే
ఆ మబ్బుల నీలినీడల్లో
నిత్యం నే దగా పడుతుంటాను

ఒక రాగం పలికితే
ఆ శబ్దపు మాయాజాల అడుగుజాడల్లో
ఆ రాగమే అనురాగమని అమాయకంగా
పదే పదే నే మోసపోతుంటాను

రాళ్ళతో కొట్టబడ్డ ప్రతీసారి
సుమగంధాల పెదజల్లే పూలేమైనా
పడుతాయేమోనని పెర్రిగా ఎదురుచూస్తుంటాను

వధ్యశిలపై శిలువవేయబడ్డ ప్రతీ తరుణం
మేకులు, బాకులు, ముళ్ళకిరీటాలు
శరీరాన్ని చీలుస్తున్నా
ఒక్క ప్రేమమయ ఓదార్పుకై
ఒక్క స్నేహమయ కరస్పర్శకై ఆశగా వేచి ఉంటాను

నీతి కోసం, నిజాయితి కోసం
జీవితం సర్వం కోల్పోయినా

నిషిధి శ్మశానంలో
ఆత్మల, అంతరాత్మల ఘోషల మధ్య
కాలుతున్న మృతకళేబరాల మధ్య
చితిమంటల చిటపటల మధ్య

నిరంతరం నవ్యోత్తేజం అందించే
ఉషోదయానికై ఆశగా నిరీక్షిస్తుంటాను

నమ్మకం నా ఇజం
నిరీక్షణ నా నైజం
దగా పడడం నా బలహీనత
పదే పదే మోసపోవడం నా ప్రత్యేకత

పొగడ్తలకి పొంగిపోను
విమర్శలకి కృంగిపోను

నేను సగటు మనిషిని
ఇంకా జీవితం అంటే వెగటు పుట్టని మనిషిని